క్లుప్తంగా

రైతులకు ఉచితంగా పంచదార పంపిణీ



పంచదార పంపిణీ చేస్తున్న కృష్ణయ్య

నేలకొండపల్లి: మధుఖాన్ చక్కెర కర్మాగారం పరిధిలోని చెరుకు రైతులకు ఉచితంగా పంచదార పంపిణీ కార్యక్రమాన్ని ఫ్యాక్టరీ ఎండీ. నామ కృష్ణయ్య ప్రారంభించారు. బుధవారం రాజేశ్వరపురంలోని ఫ్యాక్టరీలో రైతులకు ఉచితంగా పంచదార పంపిణీ చేశారు. ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసే రైతులకు టన్నుకు 250 గ్రాముల చొప్పున ఉచితంగా పంచదార అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు రైతులకు పంపిణీ చేశారు. ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, డీజీయం అప్పారావు, చెన్నారం సొసైటీ మాజీ చైర్మన్ చింతనిప్పు సైదులు, రైతు ప్రతినిధులు భద్రయ్య, గోపాలరావు, మంకెన వెంకటేశ్వరరావు, తాళ్లూరి రవి, ఇంటూరి ఆశోక్, జటంగి వెంకన్న, బొనగిరి కిరణ్, దండా రంగయ్య పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్‌గా అంజిని



నేలకొండపల్లి: యువజన కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్‌గా మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజినిని నియమించారు. ఈ మేరకు బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అంజిని మాట్లాడారు... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు అంజినిని అభినందించారు.

సంత వేలం వాయిదా

కూసుమంచి: 2025–26 సంవత్సరానికి పాలేరులోని వారపు సంత నిర్వహణకుగానూ బుధవారం వేలం నిర్వహించారు. డీఎల్‌పీఓ రాంబాబు పర్యవేక్షణలో ఈ వేలాన్ని నిర్వహించగా సరైన మద్దతుధర లభించకపోవటంతో వేలాన్ని సోమవారానికి వాయిదా వేశారు. వేలంలో 19 మంది పాటదారులు పాల్గొనగా ప్రభుత్వ మద్దతు ధరను రూ.51 లక్షలుగా నిర్ణయించారు. కాగా పాటదారులు రూ.45.12 లక్షల వరకే పాటను పాడటంతో మద్దతు ధర కూడా రాకపోవటంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాంచందర్, గ్రామ కార్యదర్శి హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు, దిండ్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న హన్మంతరెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం డేర్ కాలేజీ క్యాంపస్‌లో ఉన్న టేకులపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు దుప్పట్లు, దిండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖమ్మం రీజియన్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి, బ్యాంకు ఏజీఎంలు సర్వేశ్, సుధాకర్, చీఫ్ మేనేజర్ ప్రియదర్శిని, డేర్ కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, గురుకుల పాఠశాల కరస్పాండెంట్ ప్రణీత పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లోని బైపాస్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్తా (అయ్యప్ప స్వామి) దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కేరళ నుంచి వచ్చిన తంత్రి తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి, మేల్ శాంతి పాకతిలం నారాయణన్ నంబూద్రి తదితర 21 మంది నంబూద్రి స్వాములతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మేకల హనుమంతరావు, కార్పొరేటర్లు చావ మాధురి, నారాయణరావు, సరిపుడి రమాసతీష్, సభ్యులు అట్లూరి మధు, పుల్లంరాజు, నాగేశ్వరరావు, వల్లభనేని రామారావు, ఆలస్యం నారాయణరావు, పాపినేని రామారావు, వేజెండ్ల రవీంద్రబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి అంకమ్మతల్లి జాతర

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్టు దేవాలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఇందుకోసం దేవాలయంను ప్రత్యేకంగా ఆలంకరించి జాతరకు ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం..

కూరగాయల మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలు

- కేటాయించిన దుకాణాల వెనుకా, ముందు ప్రాంగణాల్లో షెడ్ల నిర్మాణాలు
- రాజకీయ అండతోనే ఆగడాలు



హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలు



ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఈ కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ మార్కెట్, రిటైల్ మార్కెట్ల నిర్వహణ ఉంది. ఈ మార్కెట్ నుంచి ఖమ్మం జిల్లాతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల వ్యాపారులు కూరగాయలు కొనుగోళ్లు, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పలు రకాల కూరగాయలు, దుంపలు, ఉల్లిగడ్డలు వంటి కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. వీటితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు పండించిన కూరగాయలను ఈ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వ్యాపారులంతా సరుకును నేరుగా కొనుగోలు చేస్తూ వివిధ ప్రాంతాల వ్యాపారులకు, రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఈ వ్యాపారులంతా కూడా కమీషన్ వ్యాపారుల పేరిటనే చెలామని అవుతున్నారు. ఇక్కడ ఖరీదుదారులు ఎవరూ లేరు. కమీషన్ వ్యాపారుల సౌకర్యార్థం మార్కెట్ కమిటీ దుకాణ సమూదాయాన్ని నిర్మించింది. మొత్తం 48 మంది కమీషన్ వ్యాపారులకు నామమాత్రంగా ఒక్కో దుకాణానికి రూ.1,600ల చొప్పున కేటాయించి నిర్వహిస్తున్నారు.

ఇష్టారీతిన ఆక్రమించుకుని..

రైతులకు, మార్కెట్‌కు తీసుకువచ్చే పంట వాహనాలకు ప్రయోజనం, సౌకర్యవంతంగా ప్రభుత్వం మార్కెట్‌ను నిర్మించింది. ఆ నిర్మాణాలను వ్యాపారులు తమ కార్యాలయాలుగా వినియోగించుకుంటూ, మార్కెట్ ప్రాంగణాన్ని ఎక్కడికక్కడ ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేసుకొని తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. మార్కెట్‌లో కమీషన్ వ్యాపారులకు కేటాయించిన దుకాణాలకు ముందు, వెనక జాగాలతో పాటు, ప్రాంగణంలో పలుచోట్ల వ్యాపారులు అనుమతులు లేకుండా షెడ్లను నిర్మించుకున్నారు. అక్రమ షెడ్ల నిర్మాణాలతో పాటు ఆయా వ్యాపారుల డీసీఎంల వంటి వాహనాలను నిలుపుకునేందుకు మార్కెట్ ప్రాంగణంలోనే ఆయా వ్యాపారులు జాగాలను నిర్దేశించుకున్నారు. దీంతో రైతులు పండించే పంటతో మార్కెట్‌కు విక్రయానికి వస్తే వాహనం నిలుపుకునేందుకు కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. రైతుల వాహనాలను గేట్ల బయటే నిలుపుకుని వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాక రైతుల పంట కోసం నిర్మించిన షెడ్డును కూడా వ్యాపారులు ఆక్రమించుకొని ఖాళీ ట్రేలు పెట్టుకొవడానికి వినియోగించుకుంటున్నారు.

రాజకీయ అండతోనే..

రాజకీయ నాయకుల అండతోనే హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఈ వ్యాపారులు పలు రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్నారు. నాయకుల అండదండలతో ఇక్కడ వ్యాపారులు తమ అక్రమాలను సాగిస్తున్నారు. ప్రధానంగా నలుగురు వ్యాపారులు ప్రధాన రాజకీయ పార్టీల్లో కొనసాగుతూ ఈ మార్కెట్‌ను గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. కొందరు తాతలు తండ్రుల తరాలుగా మార్కెట్‌ను శాసిస్తున్నారు.

తప్పుడు లెక్కలతో మార్కెట్ ఆదాయానికి గండి

మార్కెట్ వ్యాపారులు తప్పుడు లెక్కలు చూపుతూ మార్కెట్ కమిటీ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు. ఈ మార్కెట్‌లో సీజన్ ధరల ఆధారంగా నిత్యం రూ. 30 నుంచి రూ. 40 లక్షల కూరగాయల, ఆకుకూరల వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. నిత్యం ఈ మార్కెట్‌కు 40 టన్నుల ఆలుగడ్డ, 100 టన్నుల ఉల్లిగడ్డలు, నాలుగు నుంచి ఐదు లారీల్లో టమాటా, క్యారెట్, బీట్‌రూట్, ఇతర కూరగాయలు, పచ్చిమిర్చి వంటి కూరగాయలు ఇక్కడ విక్రయిస్తుంటారు. నిత్యం ఈ మార్కెట్‌కు వచ్చే కూరగాయల ద్వారా మార్కెట్ కమిటీకి (ప్రభుత్వానికి) ఒక శాతం పన్ను చొప్పున రూ. 30 నుంచి రూ. 40 వేలు ఆదాయం రావాల్సి ఉంది. అటువంటిది దీనిలో 10వ శాతం కూడా పన్ను రూపంలో మార్కెట్ కమిటీకి వసూలు కావటం లేదు. అంటే ఈ మార్కెట్‌లో వ్యాపారుల ఆదిపత్యం ఏ మేరకు ఉందో అర్థమవుతుంది.

మార్కెట్ కమిటీ ద్వారా ప్రక్షాళన..



మార్కెట్‌లో అక్రమాలను అరికట్టేందుకు ప్రక్షాళన చేస్తాం. వ్యాపారులకు దుకాణాలను మాత్రమే కేటాయించాం. ఇతర నిర్మాణాలకు అనుమతులు లేవు. కోవిడ్ సమయంలో కొందరు వ్యాపారులు దుకాణాలకు, వెనక, ముందు నిర్మాణాలు చేశారు. ఈ అక్రమాలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.

– పి.ప్రవీణ్‌కుమార్, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ ఖమ్మం

జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయులు, హెచ్ఎంల బదిలీలు, పదోన్నతుల్లో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారి జీపీఎఫ్ సొమ్మును వారి ఖాతాలకు వడ్డీతో సహా బదిలీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం జెడ్పీ సీఈఓ దీక్షారైనాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పార్ట్ ఫైనల్, లోన్లను వెంటనే మంజూరు చేయాలని, ప్రతీ ఆరునెలలకు ఒకసారి పార్ట్ ఫైనల్ పెట్టుకునే అవకాశాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం డిప్యూటీ సీఈవో నాగపద్మజ కలిసి జీపీఎఫ్ సమస్యలపై చర్చించగా ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా శేఖర్‌రావు, సంఘం బాధ్యులు కందుల వెంకట నరసయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పటిష్టంగా అమలుచేయాలి

ఖమ్మంఅర్బన్: 10వ తరగతి పరీక్షల్లో తమ పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అక్రమ చర్యలు, నకిలీ (కాపీయింగ్) జరగకుండా నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎంఈఓ శైలజాలక్ష్మి అన్నారు. ఈ మేరకు బుధవారం ఖమ్మం అర్బన్ ఎంఆర్‌సీలో పరీక్షాకేంద్రాల హెచ్ఎంలు, బాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ పరికరాల నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో అధికారుల నంబర్లను స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రవికుమార్

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేట ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) రవికుమార్ తనిఖీ చేశారు. రెండోతరగతి విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ సర్వేలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.

అమరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వి.రాకేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సభల పోస్టర్లను బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధికి వలస వెళ్లినవారిని అక్రమ వలసదారులంటూ సంకెళ్లతో తీసుకొచ్చినా ప్రధాని మోదీ ఖండించడం లేదన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్, మక్కా రవీందర్, లక్ష్మణ్, ప్రమోద్, శివ, రాకేష్, వినయ్, యశ్వంత్, సాదిక్, పృథ్వీ, వెంకటేష్ ప్రసాద్ ఉన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు రావూరి గోవిందయ్య (103) మంగళవారం రాత్రి మృతి చెందాడు. గోవిందయ్యకు భార్య సీతమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పలువురు ఆయన మృతదేహంపై పూలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

బచ్చోడును మండల కేంద్రంగా ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: బచ్చోడు గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించాలని కోరుతూ బుధవారం బచ్చోడు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కొత్త జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలు ప్రజలకు అనుకూలంగా చేశారని, కానీ బచ్చోడు గ్రామాన్ని నూతన మండల కేంద్రం చేస్తానని ఇచ్చిన హామీని మర్చిపోయారన్నారు. 18 పంచాయతీ, 8 ఎంపీటీసీ సభ్యుల తీర్మాణాలతో కూడిన వినతిపత్రాలను వివిధ రూపాల్లో మంత్రులకు, ప్రభుత్వ అధికారులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ నాయకులు నర్సిరెడ్డి, హనుమంతరావు, జక్కుల యాదగిరి, అనంత చారి, ఎన్నబోయిన వెంకటరమణ, నీరుడు రమేష్, గుజ్జ రామకృష్ణ, శ్రీరాములు, రమణ, సాలయ్య, వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ పరిధిలోకి బాలగణపతి ఆలయం



హుండీ లెక్కిస్తున్న అధికారులు, దేవస్థానం చైర్మన్ తదితరులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ శ్రీ బాలగణపతి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నట్టు ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి బుధవారం తెలిపారు. ఈ మేరకు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు, ప్రధాన అర్చకులు గిరిల సమక్షంలో దేవాదాలశాఖ ఇన్‌స్పెక్టర్, ఏఈఓలు దేవాలయంలోని హుండీ నగదు లెక్కించి నగదు స్వాధీనం చేసుకున్నారు. హుండీ ఆదాయం రూ. 34,173లు రాగా బ్యాంకు ఎకౌంట్ తెరిచి వేసినట్టు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణాధికారులు కొత్తూరు జగన్మోహన్ రావు, వీవీ నర్సింహారావు, కె శ్రీకాంత్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు దేవాదాయ శాఖలోకి ఆలయ నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు.

రేపు తిరుపతమ్మ కల్యాణం

కూసుమంచి: మండలంలోని ధర్మాతండా సమీపంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కల్యాణం సందర్భంగా భక్తుల బోనాల సమర్పణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పరదా వితరణ

నేలకొండపల్లి: స్థానిక భక్తరామదాసు ధ్యాన మందిరానికి పూజల అనంతరం మహా నైవేద్యం పెట్టే సమయంలో అడ్డుగా పెట్టే పరదాను భక్తులు గెల్లా కృష్ణారావు, పారేపల్లి గోపాలకృష్ణ వితరణగా అందజేశారు. బుధవారం స్థానిక భక్తరామదాసు ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా మండలి సభ్యురాలు వెంకటలక్ష్మి, పూజారి సామిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో తనిఖీ

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామంలోని కిరాణ దుకాణాలపై బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. దుకాణాల్లో కాలం చెల్లిన తినుబండరాలు, శీతల పానీయాలు ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు చేసి పదార్థాలు, డ్రింక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మహానగరాలకు దీటుగా ఖమ్మాన్ని తీర్చిదిద్దాలి



సిబ్బందికి బాటిళ్లు అందజేస్తున్న కమిషనర్, మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరాన్ని ఆధునిక సౌకర్యాలతో మహానగరాలకు దీటుగా తీర్చిదిద్దాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో నగర అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై మేయర్ చర్చించారు. నగరంలో ప్రధాన సమస్యలతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ ఇబ్బందులపై మాట్లాడారు. నగరంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం, ప్రధాన కూడళ్ల ఆధునీకీకరణపై మాట్లాడారు. ప్రధాన రోడ్డు వెంట 50 సెంటీమీటర్ల వెడల్పుతో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటుపై కమిషనర్ వివరించారు. హైదరాబాద్ తరహాలో జంతువుల కోసం పెట్‌పార్క్ నిర్మాణంపై కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 24 లేదా 25న ఖమ్మం నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, కౌంటర్ల ఏర్పాటు, నిధుల జమ తదితర అంశాలను కమిషనర్ మేయర్‌కు వివరించారు. సుడా నిధుల కేటాయింపు, వినియోగంపై సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ ఫీజుల సేకరణలో రాష్ట్రంలోనే ఖమ్మం ప్రథమస్థానంలో నిలిచిందని కమిషనర్ తెలిపారు.

సిబ్బందికి సామగ్రి అందజేత

పారిశుద్ధ్య, డీఆర్ఎఫ్ సిబ్బందికి కేఎంసీ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య వాటర్ బాటిళ్లు, అప్రాన్, హెల్మెట్ అందజేశారు. శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లెక్చరర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని, విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి నిధులను పెంచాలని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గ వీటి సరళ,. మాచర్ల భారతి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జార్జి రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు మందా సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, పీఎన్ఎమ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సదానంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



ఖమ్మంరూరల్: దీక్షలో నాయకులు



రఘునాథపాలెంలో..

ఖమ్మంరూరల్: ఎస్సీ వర్గీకరణ జీవోకు చట్టబద్ధత కల్పించి, వెంటనే అమలు చేయాలని మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. నాయకులు మామిడాల కిరణ్, వంగూరి ఆనందరావు, కనకం జనార్దన్, సిరిపురపు బందయ్య, గద్దల లక్ష్మణ్, కృష్ణ ఉన్నారు.

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. సీపీఎం మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి సంఘీబావం వ్యక్తం చేశారు. ఎంఎస్‌పీ మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూరగంటి అంజయ్య, మండల ఇన్‌చార్జ్ గాజుల నరసింహారావు, మండల అధ్యక్షుడు మంద గోపాలరావు, కంచర్ల మోహన్, ప్రభాకర్, నాగభూషణం, చిన్న పుల్లారావు, రాము, ఏసోబు, మంద శ్రీను, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి తోళ్ల సురేష్ సూచించారు. మండల కేంద్రంలోని దీక్షా శిబిరాన్ని సందర్శించారు. మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న, తోళ్ల వెంకన్న, వడ్లమూడి ప్రసాద్, యాతాకుల శ్రీనాథ్, నాయకులు ఉన్నారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం

ఖమ్మంఅర్బన్: వేసవిలో తాగునీటికి ఇబ్బందిపడుతున్న పేదలకు తాగునీటి కష్టాలు తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ అన్నారు. బుధవారం నగరంలోని 3వ డివిజన్ కార్పొరేటర్ దివంగత మలీదు జగన్ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు ట్యాంకర్‌ను తయారు చేసి తాగు నీటి ఎద్దడి తీర్చడానికి ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష అద్భుతమైనది

ఖమ్మం సహకారనగర్: తెలుగు భాష అద్భుతమైనదని సరళంగా, ఒత్తుల్లేకుండా రాయడానికి ఆస్కారముందని, భాషా పరిశోధకులు, తెలుగు ఉపాధ్యాయులు చంద్రగిరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు లిపి–సరళత ఒత్తుల్లేకుండా, ఒత్తిడి లేకుండా తెలుగు రాయడం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, తెలుగు విభాగాధిపతి డాక్టర్ పి.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సీతారాం, డాక్టర్ జె.అనురాధ, డాక్టర్ కిరణ్, కోటమ్మ, డాక్టర్ ఎంవి.రమణ, డాక్టర్ కె.కార్తీక్, శ్రీనివాస్ పాల్గొన్నారు .

మహిళలకు అండగా ఐద్వా..



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న మాచర్ల భారతి

ఖమ్మంమయూరిసెంటర్: ఐద్వా మహిళలు హత్యలు, అత్యాచారాలు, హింస, శ్రమదోపిడీకి గురవుతుంటే ఐద్వా వారికి అండగా నిలిచిందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. బుధవారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి జెండా ఆవిష్కరించారు. అనంతరం మెరుగు రమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. మహిళలపై అన్యాయం జరిగినా స్పందిస్తూ మహిళలకు సామాజిక స్పృహ అందిస్తూ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. మహిళల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని, కేరళ తరహాలో రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను ప్రతీ తెల్ల రేషన్‌కార్డుదారులకు అందించాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా నాయకురాలు ఎండి.మెహ్రూనీస బేగం, నాగసులోచన, బేబీ, భాగం అజిత, ఎస్.కుమారి, నందిపాటి పావని, పి.ప్రమీల, పి.శరణ్య వెంకటలక్ష్మి, కోటేశ్వరి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



కూసుమంచి: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు



నేలకొండపల్లిలో..

కూసుమంచి: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా మండలంలోని మాజీ సర్పంచ్‌లను కూసుమంచి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు. వారితో పాటు తమ సమస్యలపై హైదరాబాద్ వెళ్లే మాజీ వీఆర్ఏలను ముందస్తుగా అరెస్ట్ చేశారు.

నేలకొండపల్లి: బిల్లులు అడిగినందుకు అరెస్టులు చేయటమేనా ప్రజాపాలన అంటే అని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గండు సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ముట్టడి సందర్భంగా స్థానిక పోలీసులు తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టులు చేశారు.